





జనగామ: దొడ్డు వడ్లకు కూడా రూ. 500 బోనస్ ప్రకటించాలని ప్లకార్డులతో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే పల్లా, బీఆర్ఎస్ శ్రేణులు

- సన్నాలతోపాటు దొడ్డు వడ్లకూ రూ. 500 చెల్లించాలి
- కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కొనాలని డిమాండ్
- రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నిరసన
- అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు
- పాల్గొన్న పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

# బోనస్ ఇవ్వాల్సిందే..

## కాంగ్రెస్ సర్కారు తీరుపై భగ్గుమన్న బీఆర్ఎస్

**రైతాంగాన్ని అన్ని రకాలుగా మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు తీరుపై బీఆర్ఎస్ నాయకులు కదం తొక్కారు. సన్నాలతోపాటు దొడ్డు వడ్లకూ రూ. 500 బోనస్ చెల్లించాలని, కేంద్రాల్లో పేరుకుపోయిన వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులకు మద్దతుగా ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు, ధర్నాలు చేశారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. పోలింగ్ ముగిసిన తెల్లారే వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు సన్నవడ్లకే బోనస్ ఇస్తామంటున్నదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.**

*- జనగామ(నమస్తే తెలంగాణ)/ఖానాపురం/కేసముద్రం/పాలకుర్తి/వర్ధన్నపేట, మే 16*

### రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ..

అధికారం కోసం కాంగ్రెస్ పచ్చి అబద్ధాలతో ప్రజలను మభ్య పెట్టింది. ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని మాట ఇచ్చి తప్పితే రైతులతో కలిసి బీఆర్ఎస్ ఎక్కడికక్కడ నిలదీస్తే పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇస్తామని ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే అంటూ బుకాయిస్తోంది. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించే వరకు కాంగ్రెస్ పార్టీని నిద్రపోనివ్వం. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రినన్న సంగతి మరిచిపోయి స్థాయి దిగజారి మాట్లాడుతుంటే మంత్రులు అహంకారంతో రెచ్చిపోతున్నారు. 420 హామీలు, 100 రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు ఐదు నెలులు గడుస్తున్నా దిక్కూమొక్కూ లేదు. అబద్ధపు ప్రచారాలు చేసి తప్పుడు కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదు. పిచ్చి వేషాలు వేస్తే జనాలు సహించరు.

**- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**





ఖానాపురంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు




నిరసనలో పాల్గొనేందుకు దేవరుప్పుల నుంచి పాలకుర్తికి వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు




కేసముద్రంలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు



వర్ధన్నపేటలో పాల్గొన్న హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, బీఆర్ఎస్ శ్రేణులు

రైతాంగాన్ని మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు గురువారం జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఖానాపురంలో చేపట్టిన నిరసనలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల తర్వాత మాట మారుస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన స్థానిక ఎమ్మెల్యే దొంతి ఎన్నికలు ముగిశాక నోరు విప్పకపోవడం దుర్మార్గమన్నారు. కేసముద్రం మార్కెట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రావడానికి అనేక రకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మాట మారుస్తున్నాడని అన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. వర్ధన్నపేటలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేయగా, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. హామీలు అమలు చేయకుండా మాటలతో కాలం వెళ్లబుచ్చుతూ రైతులు, ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని అన్నారు. ఆగస్టు 15 వరకు స్థానిక సంస్థలు, సర్పంచ్‌ల ఎన్నికలు పూర్తి కానున్నందున ఈ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే ఆగస్టు 15వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని విమర్శించారు. పాలకుర్తిలోని రాజీవ్ చౌరస్తాలో చేపట్టిన నిరసనలో పార్టీ నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీలు వేములపల్లి ప్రకాశ్‌రావు, అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీలు మార్గం భిక్షపతి, పుస్కూరి శ్రీనివాస్‌రావు, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటనర్సయ్య, తూళ్ల కుమారస్వామి, పస్నూరి నవీన్, నర్సింహనాయక్, తీగాల ధయాకర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాగి శెట్టి ప్రసాద్, జక్క అశోక్, బాల్నె వెంకన్న, శ్రీనివాస్‌గుప్తా, యువరాజ్, రాజుయాదవ్, నాయకులు ఊకంటి యాకుబ్‌రెడ్డి, నీలం దుర్గేశ్, మోడెం రవీందర్‌గౌడ్, కముటం శ్రీనివాస్, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, గుగులోత్ వీరునాయక్, శింగంశెట్టి ఏకాంతం, మిట్టగడుపుల మహేందర్, కూన భద్రాద్రి, శతకోటి నరేశ్, బానోత్ వెంకన్న, బుర్ర కుమారస్వామి, జితేందర్‌రెడ్డి, గోపాల్‌రావు, ఎలేందర్‌రెడ్డి, బండి రజిని, మంగళపల్లి శ్రీనివాస్‌రావు, సోమేశ్వర్‌రావు, అనిమిరెడ్డి, హామ్యానాయక్, రంగు మల్లయ్య, సిందె రామోజీ, గాంధీనాయక్, పోశాల వెంకన్న, కారుపోతుల వేణు, పోశాల పవన్ కుమార్, కళింగరావు, సతీశ్, పూస మధు, జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు భాగ్యలక్ష్మి, పోకల జమున, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఎడవెల్లి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు బక్క నాగరాజు, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు ఇర్రి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, కౌన్సిలర్లు బండ పద్మ, అనిత, ప్రేమలతా రెడ్డి, స్వరూప, భూలక్ష్మి, జూకంటి లక్ష్మి, సమద్, బీఆర్ఎస్ నాయకులు ఏబెల్, బక్క నాగరాజు, గుర్రం నాగరాజు, గజ్జెల నర్సిరెడ్డి, సందీప్, తిప్పారపు విజయ్, చెంచారపు పల్లవి, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాలకుర్తిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- 1.70 లక్షల మందికి ఉద్యోగాలిచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే
- రేవంత్ సర్కారు ఇచ్చిన 30 వేలు అప్పటి నియామకాలే
- చానల్ పేరుతో బ్లాక్ మెయిలింగ్ చేస్తున్న తీన్మార్ మల్లన్న
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు ఆలోచించి ఓటేయాలి
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

జనగామ, మే 16 (నమస్తే తెలంగాణ) : 'అబద్ధాలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కింది. పంచాయతీ సెక్రటరీలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఏఈవోలు, టీచర్లు, ఇంజినీర్లను నియమించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. 1.70 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. రేవంత్ ఇచ్చిన 30 వేలు కూడా కేసీఆర్ ప్రభుత్వం హయాంలో భర్తీ చేసినవే' అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేశ్‌రెడ్డితో కలిసి జనగామలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, పట్టభద్రుల సన్నాహాక సమావేశం పార్టీ సీనియర్ నాయకుడు గద్దల నర్సింగరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ఇస్తామని, 50 వేల మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి 10 వేలకు నోటిఫికేషన్ ఇచ్చి మభ్యపెట్టిందని అన్నారు. చానల్ పేరుతో బ్లాక్ మెయిలింగ్, బెదిరింపులకు పాల్పడుతున్న తీన్మార్ మల్లన్న తెలంగాణకు నయా నయీంలా తయారయ్యాడని విమర్శించారు. తన భార్య నీలిమ ట్రాన్స్‌కోలో డీఈఈగా పనిచేస్తుంటే కేసీఆర్ ఉద్యోగం ఇచ్చారని తప్పుడు ప్రచారం చేశాడన్నారు. తన సంస్థల మీద ఇంటెలిజెన్స్, పోలీసులతో ఫిర్యాదులు చేయించాడని, వాళ్ల తమ్ముడిని పంపి రూ.2 కోట్లు అడిగాడని, ఒక్క రూపాయి కూడా ఇవ్వనని చెప్పానని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకమైన బిట్స్ పిలానీలో చదివిన ఉన్నత విద్యావంతుడు రాకేశ్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ 'చార్ సౌ బీస్' గాడిని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టింది. అందుకే విద్యావంతులు, మేధావులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. అధికార పార్టీకి జీహుజూర్ అనే తీన్మార్ మల్లన్న కావాలో.. నిరుద్యోగుల గొంతుకగా ప్రశ్నించే రాకేశ్‌రెడ్డి కావాలో విజ్ఞతతో ఆలోచించాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. మోసకారులు, బ్లాక్‌మెయిలర్లను దూరం పెట్టి విద్యా వంతులకు పట్టగట్టే పరంపర మళ్లీ కొనసాగుతుందని ఆశిస్తున్నానని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై నాలుగు సార్లు గులాబీ జెండా ఎగరేశామని పల్లా రాజేశ్వర్‌రెడ్డి గుర్తు చేశారు. జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు భాగ్యలక్ష్మి, పోకల జమున, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు ఇర్రి రమణారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.



హాజరైన పట్టభద్రులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు

### బీజేపీ రాజకీయంగా హత్య చేసింది

**- ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి**

తన ఎదుగుదల చూసి ఓర్వలేక బీజేపీ రాజకీయంగా హత్య చేసింది. కొనఊపిరితో ఉన్న తనను కేసీఆర్, కేటీఆర్, పల్లా చేరదీసి బీఆర్ఎస్ పార్టీలో మంచి అవకాశం ఇచ్చారు. తాను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి కానుకగా ఇస్తా. రూ. 4వేల నిరుద్యోగ భృతి, 50 వేల మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ప్రకటన ఊసేలేదని, ఏరికోరి ఎన్నుకుంటే నిరుద్యోగులను కాంగ్రెస్ నిండా మోసం చేసింది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోయినా వచ్చే నష్టం లేదని..ప్రభుత్వాన్ని ప్రశ్నించేవాడా? లేదా ప్రశంసించేవాడు కావాలో ఆలోచన చేయాలన్నారు. కాంగ్రెస్ వచ్చాక ఒక్కసారైనా ప్రశ్నించాడా? కాంగ్రెస్ అభ్యర్థిని రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతా అని ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టిన వాడిని ఓటు ఆయుధంతో దెబ్బకొట్టాలని పిలుపునిచ్చారు.

# ఉమ్మడి వరంగల్‌లో జోరు వాన

నమస్తే నెట్‌వర్క్, మే 16: ఉమ్మడి జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో జోరు వాన కురుస్తోంది. వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో వరద నీరు రోడ్ల మీద ప్రవహించింది. అండర్ బ్రిడ్జి ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలువడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. దీంతో సుమారు 2 గంటల సేపు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. గణపురం మండలం కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన వర్షం మూడు గంటలసేపు కురిసింది. జనగామలో ఓ మోస్తరు వాన పడింది. మహబూబాబాద్ పట్టణంలో భారీ వర్షం కురి సింది. దీంతో కాలనీలోని రోడ్లపైన నీరు నిలిచింది. ఐనవోలు, మడికొండ, కాజీపేట తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది.

**బల్దియాలో కంట్రోల్ రూమ్**

వరంగల్, మే 16: నగరంలో కురుస్తున్న భారీ వర్షాలతో బల్దియా అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం రాత్రి నుంచే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 24 గంటలు పనిచేసేలా సిబ్బందిని నియమిస్తూ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. 9701999645, 9701999676 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.



మహబూబాబాద్‌లో కురుస్తున్న వర్షం



చెత్తకుప్పలో పడేసిన మందులు

# చెత్తకుప్పలో ఔషధాలు

## విలువైన మందులకు నిప్పు

- వైద్యుల నిర్లక్ష్యంతో పేదలకు అన్యాయం
- గణపురం పీహెచ్‌సీలో నిర్వాకం
- పర్యవేక్షించని భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ

**పేదలకు అందాల్సిన ఎంతో విలువైన ఔషధాలు చెత్తకుప్పల పాలవుతున్నాయి. అనారోగ్యంతో దవాఖానకు వచ్చిన వారికి అన్ని రకాల మందులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో వాటికి కాలం చెల్లిన తర్వాత తగలబెడుతున్నారు. ఈ తతంగమంతా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో జరుగుతున్నది.** *- గణపురం, మే 16*

పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి మందులను కొనుగోలు చేస్తున్నది. ఆయా పీహెచ్‌సీలకు అవసరం మేరకు వివిధ రకాల ఔషధాలను సరఫరా చేస్తున్నది. వాటిని వైద్య సిబ్బంది రోగులకు సక్రమంగా అందించకపోవడంతో గడువు దాటిపోవడంతో పడేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. గణపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కోసం ప్రతి రోజూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వస్తుంటారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి సరైన మందులు అందించాల్సిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో 250 నుంచి 300 మంది రోగులు పీహెచ్‌సీకి వచ్చేవారు. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం రోగుల సంఖ్య తగ్గింది. వచ్చిన వారికి సైతం తూతూ మంత్రంగా వైద్యసేవలందిస్తూ నామమాత్రంగా మందులు ఇవ్వడంతో విలువైన మందులు కుప్పలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. ఏళ్ల తరబడి నిల్వ ఉండడంతో వాటి కాలపరిమితి దాటిపోతున్నది. చేసేదేమీ లేక ఆసుపత్రి సిబ్బంది వాటిని ఎవరూ చూడకుండా తగులబెడుతున్నారు. దీంతో దుర్వాసన వచ్చి అనారోగ్యానికి గురవుతున్నామని చుట్టుపక్కల ఇండ్లలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. గడువు తీరిన మందులు, వాడిన సూదులు, బ్యాండేజ్ క్లాత్‌లు జీపీ ట్రాక్టర్‌లో బయట పడేయాల్సి ఉండగా వైద్యశాల కాంపౌండ్‌లోనే పడేస్తున్నారు. సిబ్బంది రోగులతో కఠినంగా మాట్లాడుతున్నారని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సమయానికి డాక్టర్లు ఉండడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు**

పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్నప్పటికీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఏ ఒక్కరోజూ దవాఖానను సందర్శించి తనిఖీలు చేసిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. వైద్య సిబ్బంది ఉదయం 11 గంటలకు వచ్చి సాయంత్రం నాలుగు గంటలలోపే వెళ్లిపోతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. డాక్టర్లు, సిబ్బంది మండల కేంద్రంలో ఉండి వైద్య సేవలందించాల్సి ఉండగా వరంగల్, హనుమకొండ, పరకాల నుంచి రాకపోకలు సాగిస్తూ సమయపాలన పాటించడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై పీహెచ్‌సీ వైద్యులకు 'నమస్తే తెలంగాణ' ఫోన్ చేయగా వారు స్పందించలేదు.